

మార్చి 30, 31వ తేదీల్లో

శ్రీవారి ఆలయంలో శ్రీరామ నవమి

30న హనుమంత వాహనసేవ

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మార్చి 30, 31వ తేదీల్లో శ్రీరామనవమి, శ్రీరామ పట్టాభిషేకం పర్వదినాలను పురస్కరించుకుని టీటీడీ ఘనంగా ఆస్థానాలు నిర్వహించనుంది. ఈ సందర్భంగా మార్చి 30న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. . ఆ తరువాత రాత్రి 9 నుంచి 10గంటల నడుమ బంగారువాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. ఈకారణంగా సహస్రదీపాలంకార సేవను టిటిడి రద్దు చేసింది. మార్చి 31న రాత్రి 8 నుండి 9 గంటలకు బంగారువాకిలి చెంత ఆలయ అర్చకులు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు.

పట్టభద్రుని ఓటు రేటు రూ.500

- విచ్చలవిడిగా కొనుగోలు చేసిన వైసిపి
- నైతికంగా ఓడిపోయిన అధికార పార్టీ
- పట్టణాల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పల్లెల్లో సర్పంచుల ద్వారా పంపిణీ
- సహకరించిన వాలంటీర్లు
- కొన్ని ప్రాంతాల్లో ఎదురు దెబ్బ

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ఎన్నో వ్యయప్రయాసలు ఓర్చి చదువుకుని పట్టా పొందిన పట్టభద్రుని ఓటుకు అధికార పార్టీ వైసిపి రూ.500లకు భేరం పెట్టింది. గ్రామాలు మొదలు.. పట్టణాల వరకు ఓటరుగా నమోదైన వారికి డబ్బులు ఎరవేసి కొనుగోలు చేసింది. మచ్చులేకుండా జరుగుతున్న ఎంఎల్‌సి ఎన్నికలకు వైసిపి మకిలి పూసింది. కాంట్రాక్టుల ద్వారా, మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బులు యథేచ్ఛగా పంపిణీ చేసింది. తిరుపతి వంటి ప్రాంతాల్లో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి మద్ధతుదారులు కొన్ని ప్రాంతాల్లో అడ్డుకున్నా.. ఎక్కువ ప్రాంతాల్లో పంపిణీ పూర్తి చేశారు. ఇదిలా ఉంటే వైసిపి ఇస్తున్న డబ్బులు కొన్ని ప్రాంతాల్లో ఓటర్లు తిరస్కరించారు. తద్వారా తమకు విజ్ఞత ఉందని నిరూపించారు.

పట్టభద్రులు, టీచర్ల స్థానానికి జరిగే ఎన్నికలు ఎప్పుడూ నిజాయితీగా జరుగుతాయి. మేధావులు ఎన్నికయ్యే ఈ స్థానానికి ఎన్నడూ డబ్బుల పంపిణీ ఉండేది కాదు. అందుకే ఈ స్థానాలకు ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వారు ఎన్నికవుతారు. ఎక్కువగా మధ్యతరగతికి చెందిన ఉపాధ్యాయులే ఈ స్థానానికి ఎన్నికవుతారు. గడిచిన మూడు ఎన్నికల్లోనూ ఇదే నిరూపితమైంది. ప్రజాపక్షానికి చెందిన, పోరాడే గొంతుకలు ఈ స్థానాల్లో ఎన్నికయ్యి సమాజానికి ఎన్నో విలువలు నేర్పారు. అయితే ఈ చరిత్రకు అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మకిలి అంటించింది. తూర్పు రాయలసీమ ప్రాంతానికి ఒకమద్యం వ్యాపారస్తునిని పోటీలో నిలబెట్టింది. అందులో వచ్చిన డబ్బుతో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పట్టభద్రుల ఓటును రూ.500లకు భేరం పెట్టి కొనుగోలు చేసింది. దీంతో ఎంతో పవిత్రంగా జరగాల్సిన ఈ ఎంఎల్‌సి ఎన్నికల్లో డబ్బులు పంపిణీ చేసి చెదలు పట్టించింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా రెండు రోజులు డబ్బులు పంపిణీ చేశారు. పట్టభద్రుల ఓటుకు రూ.500లపంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచుల ద్వారా, నగరాల్లో కార్పొరేటర్లు, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు దగ్గరుండి ఈ పంపిణీని చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి ప్రతిచోటా ఈ తంతు సాగింది. అర్ధరాత్రి రెండు గంటల వరకు పంపిణీ చేస్తూనే ఉన్నారు. పట్టభద్రులు ఎక్కడున్నారనే విషయాన్ని వాలంటీర్లు నాయకులకు జాబితాలు చేర్చారు. కాగా కొన్నిప్రాంతాల్లో రూ.500లు ఇవ్వడంతో తమకు వద్దని ఓటర్లు తిరస్కరించడం కొసమెరుపు.

అధికార పార్టీ ఓటుకు నోటు

- అడ్డుకున్న సిపిఎం నాయకులు
- పట్టుకుని అప్పజెప్పినా వదిలేసిన పోలీసులు



తిరుపతిలోని సుందరయ్యనగర్‌లో డబ్బులు పంపిణీ చేస్తున్న వైసిపి నేతలు


ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి ఎలాగైనా గెలావాలనన ఉద్యేశంతో తిరుపతి నగరంలో సుమారు 10వేల దొంగ ఓట్లు నమోదు చేసిన విషయం తెలిసిందే... ఆదివారం వైసిపి శ్రేణులు ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేసే కార్యక్రమం వేగంతం చేశారు. నగరంలోని సుందరయ్యనగర్, యశోదానగర్‌లో వాలంటీర్లతో కలిసి వైసిపి కార్యకర్తలు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్లకు రూ.500లు, ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటర్లకు రూ.5వేలు పంపిణీ చేస్తుండగా చైతన్య, అరుణ్ అనే వ్యక్తులను సిపిఎం కార్యకర్తలు గుర్తించి, డబ్బుల పంపిణీని అడ్డుకున్నారు. అనంతరం వారిని పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. అయితే పోలీసులు వెంటనే వైసిపి కార్యకర్తలను, వార్డు వాలంటీర్లను వదిలిపెట్టేశారు. వారు దర్జాగా బయటకు వచ్చేశారు. దీంతో సిపిఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు కందారపు మురళి మాట్లాడుతూ వైసిపి నేతలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడానికి కుట్రలు చేస్తోందన్నారు. ఇంత నిర్భయంగా వారు డబ్బులు పంపిణీ చేయడం, పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశాంతంగా ఎన్నికలు జరగకుండా వైసిపి నేతలు ఓటర్లను బెదిరిస్తున్నారని విమర్శించారు. దొంగ ఓట్లు ఉన్నవారిని కూడా ఓటింగ్‌కు వచ్చేలా చేస్తున్నారని వెల్లడించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ దొంగఓట్లు వేయకుండా కఠినచర్యలు తీసుకోవాలని, వైసిపి అరాచకాలను నివారించాలని డిమాండ్ చేశారు. డబ్బు పంపిణీ చేస్తున్నవారిని పోలీసులకు పట్టిస్తే ఎలా వదిలేస్తారని ప్రశ్నించారు. మేధావులు, పట్టభద్రులు, ఉపాధ్యాయులు జరుగుతున్న పరిణామాలను ఆలోచించాలని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు జిబిఎస్.మణ్యం, నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, డివైఎఫ్‌ఐ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్. జయచంద్ర, బుజ్జమ్మ, రమణ యాదవ్, వేణు, ఎన్‌డి శ్రీను పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు కందారపు మురళి

శ్రీకాళహస్తి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులను ప్రలోభ పెట్టేందుకు అధికార పార్టీ ఓటుకు నోటు మంత్రాన్ని ప్రవేశపెట్టిందని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి విమర్శించారు. ఉపాధ్యాయులకు రూ.5వేలు, పట్టభద్రులకు రూ.500 చొప్పున స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పంచి పెట్టారని ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో వున్న 11 వేల ఓట్లలో సుమారు 2 వేలు దొంగ ఓట్లను గుర్తించామని చెప్పారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఎమ్మెల్యే వాలంటీర్లను పావులుగా వాడుకుంటున్నాడని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చలపతి నాయుడు, సత్రవాడ ప్రవీణ్, కంట రమేష్, కాసరం రమేష్,మిన్నల్ రవి,చెంచయ్య నాయుడు,సన్నీ,ప్రసాద్ నాయుడు, పాల్గొన్నారు.

బాలాయపల్లి: జిల్లా అట్రాసిటీ కమిటీ సభ్యులు ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించిన సంఘటన ఆదివారం జరిగింది. అధికారం పార్టీ సభ్యుడుని గెలిపించాలని ప్రచారం చేయడం దారుణం. గూడూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా అట్రాసిటీ కమిటీ సభ్యులు ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించి ప్రచారం చేస్తున్న విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోలేదు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.



బాలాయపల్లిలో ఎలక్షన్ కోడ్ ఉల్లంఘన

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

దొంగ ఓటు వేసినా, ప్రయత్నించినా చర్యలు
ఓటరు స్లిప్పుతో పాటు ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరి : కలెక్టర్



ప్రజాశక్తి- తిరుపతిటౌన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. వెంకట రమణారెడ్డి తెలిపారు. జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామాగ్రి పంపిణీ పూర్తిచేసినట్లు తెలిపారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం స్థానిక శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాల బ్లాక్ 1లో పోలింగ్ సామగ్రి పంపిణీ విధానాన్ని పరిశీలించి తీసుకోవల్సిన జాగ్రత్తలను సూచించారు. పిఒ, ఏపిఓలు, ఇతర పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో చెక్‌లిస్టు జాగ్రత్తగా సరిచూసుకోవాలని, బ్యాలెట్ బ్యాక్సు, పేపర్ సీఎల్, బ్యాలెట్ పేపర్, సీరియల్ నెంబర్లు ఇప్పటికే పూర్తిగా పరిశాలించామన్నారు. అయినా తప్పనిసరిగా ప్రతి సీరియల్‌ను చెక్ చేసుకోవాలని, పిఓ డైరీ పోలింగ్ నిర్వహణలో పూరించాల్సిన ఫారమ్స్, ఓటరు వేలికి వేయనున్న గుర్తింపు ఇంక్, ఓటరు ఓటు వేయడానికి వైలెట్ స్కెచ్ పెను వంటివి తీసుకువెళ్లాలన్నారు. పోలింగ్ విధులు కేటాయించిన వారు ఆదివారం రాత్రి పోలింగ్ కేంద్రాల్లో బస చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేయాలని, ప్రతి పోలింగ్ కేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి వీక్షించే విధంగా ఏర్పాటు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామన్నారు. పోలింగ్ రోజు సోమవారం ఉదయం 6 గంటలకు అందరూ సిద్ధంగా ఉండి, 7 గంటలకు అభ్యర్థి లెటర్ ఆధారంగా పోలింగ్ ఏజెంట్ల పాసుల జారీ, 7.30 గంటలకు ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సు సీల్, పోలింగ్ ప్రక్రియ డిక్లరేషన్ చదివి 8 గంటలకు ఓటింగ్‌కు అనుమతివ్వాలన్నారు. ఓటింగ్ సమయంలో వారి గుర్తింపు ఆధారాలు క్షుణ్ణంగా పరిశీలించి అనుమతించాలని, బ్యాలెట్ కౌంటర్ పేపర్‌లో సంతకంతో వీరి వేలిముద్రలు తప్పనిసరి అన్నారు.

దొంగ ఓటుకు ప్రయత్నిస్తే వెంటనే పిఓ అక్కడే వున్న పోలీసులకు కంప్లైంట్ ఫారం నింపి అప్పగించాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ సీలింగ్ ఏజెంట్ల సమక్షంలో పూర్తిచేసి సంబంధిత డివిజన్ కేంద్రం మధ్యంతర స్ట్రాంగ్ రూమ్ పిఓ, ఎపిఓలు పిఓ డైరీ, ఇతర ఫారమ్స్ అప్పజెప్పాల్సి ఉంటుందని వివరించారు. ఆపై పోలీసు బందోబస్తుతో, ఏజెంట్ల కూడా బ్యాలెట్ బాక్సుల చిత్తూరు ప్రధాన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం జరుగుతుందని తెలిపారు. ప్రతిపోలింగ్ కేంద్రానికి మైక్రో అబ్జర్వర్లు ఏర్పాటు, వారు పోలింగ్ రోజు రిపోర్ట్ ఎన్నికల పరిశీలకులకు అందిస్తారని తెలిపారు. కలెక్టర్ వెంట తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి కనకనరసారెడ్డి, నగరపాలక అసిస్టెంట్ కమిషనర్ పోలింగ్ సునీత, రిటైర్డ్ జెసి చంద్రమౌళి, పిఓ, ఎపిఒలు, పోలింగ్ సిబ్బంది, అధికారులు ఉన్నారు.

పట్టభద్రుల, ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు :

1. గూడూరు డివిజన్ డిస్ట్రిబ్యూషన్ , రిసిప్షన్ కేంద్రం : జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల
పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు 11, ఓటర్లు 18,761
ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు 8, ఓటర్లు 1345
2. సూళ్ళురుపేట డివిజన్, డిస్ట్రిబ్యూషన్ , రిసిప్షన్ కేంద్రం : ప్రభుత్వ జూనియర్ కళాశాల
పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు 11, ఓటర్లు 15,238
ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు 9, ఓటర్లు 893
3. శ్రీకాళహస్తి డివిజన్, డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్ కేంద్రం : స్కిట్ కళాశాల
పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు 11, ఓటర్లు 15,043
ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు 8, ఓటర్లు 811
4. తిరుపతి డివిజన్, శ్రీపద్మావతి మహిళల డిగ్రీ, పి.జి.కళాశాల
పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు 29, ఓటర్లు 37,899,
ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు 12, ఓటర్లు 3083,

తిరుపతి జిల్లా మొత్తం పట్టభద్రుల ఓటర్లు: 86,941,
మొత్తం ఉపాధ్యాయ ఓటర్లు:6132

67 మంది ఆటోడ్రైవర్లు ఎమ్మెల్సీ ఓటర్లు

దొంగ ఓట్లకు రంగం సిద్ధం

తిరుపతిటౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించడానికి రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం టౌన్‌బ్యాంకు ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆటోడ్రైవర్లకు పోన్ వాయిస్ ద్వారా ఓ హెచ్చరికను పంపారు. 67 మంది ఆటోడ్రైవర్లకు చదువు లేకపోయినా వారిని పట్టభద్రుల నియోజకవర్గం ఓటరుగా నమోదు చేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఎస్‌కె ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ సమీపంలోని గ్రంథాలయం వద్దకు రావాలని లేకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేశారు. అంతేకాదు ఆటోడ్రైవర్లు అందరూ శుభ్రంగా తయారై మంచి బట్టలు వేసుకుని రావాలని హుకుం జారీచేశారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడానికి దొంగ ఓట్లపై ఆధారపడుతున్నా పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు.

శాసన మండలి ఓటింగ్ ఇలా..



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి : చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికలకు ఈనెల 13వ తేదీన ఓటింగ్ జరగనుంది. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఈ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ఉంటుంది. సాధారణ ఎన్నికల్లో ముద్రణా పద్ధతిలో ఓటు వేస్తారు. శాసన మండలి ఎన్నికల్లో 'అంకెల' పద్ధతిలో ఓటు వేయాల్సి ఉంటుంది. సాధారణ ఎన్నికల్లో కేవలం ఎంపిక చేసిన అభ్యర్థికి కేటాయించిన గుర్తుపై మాత్రమే ఓటువేస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్లో అభ్యర్థులందరికీ ఓటు వేసే హక్కు ఉంటుంది.

ఉదాహరణకు...

వ.సం	అభ్యర్థి పేరు	ప్రాధాన్యతాసంఖ్య
1	రామయ్య	1
2	భీమయ్య	3
3	సోమయ్య	2
4	సీతయ్య	8
5	కల్పన	4
6	ఆనంద్	7
7	కుమార్	10
8	లక్ష్మి	5
9	సుకుమార్	9
10	మీనాక్షి	6

ఓటు వేసే విధానం ఇలా...

- ✓ బరిలో ఉన్న అందరి అభ్యర్థులకు ఓటు వేయవచ్చు.
- ✓ సిబ్బంది ఇచ్చిన 'వైలెట్' (ఊదా రంగు గల స్కెచ్‌పెన్‌తోనే ఓటు వేయాలి.
- ✓ కేవలం అంకెలను (1,2,3,...) మాత్రమే వేయాలి.
- ✓ ప్రాధాన్యత అంకె '1' తప్పని సరిగా ఉండాలి.
- ✓ అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో మాత్రమే అంకెను వేయాలి.
- ✓ ఎంపిక చేసుకున్న అభ్యర్థికి '1' సంఖ్య ఇచ్చిన తర్వాత మిగిలిన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో సంఖ్యలు (2,3,4,...) సూచించవచ్చు.
- ✓ '1' అంకె ఉంటేనే బ్యాలెట్ను పరిగణలోకి తీసుకొంటారు.

ఇలా వేస్తే ఓటు చెల్లదు...

- ✗ సిబ్బంది ఇచ్చిన స్కెచ్‌పెన్‌తో కాకుండా ఇతర పెన్నులు ఉపయోగిస్తే ఓటు చెల్లదు.
- ✗ ప్రాధాన్యత సంఖ్య '1'ని ఒక అభ్యర్థి కన్నా. ఎక్కువ మందికి ఇస్తే ఓటు చెల్లుబాటు కాదు.
- ✗ ఓటును (1,2,3,...) అంకెల్లో కాకుండా రాత పూర్వకంగా (ఒకటి, రెండు, మూడు...) అని సూచిస్తే ఓటు చెల్లదు.
- ✗ ఒకే అభ్యర్థికి రెండు అంకెలు (1,2) వేయకూడదు.
- ✗ మొదటి ప్రాధాన్యత కింద అంకె '1' వేసిన, తర్వాత ఇతర అభ్యర్థులకు వేలి ముద్రలు, సంతకాలు చేయకూడదు,
- ✗ అంకెల్లో కాకుండా 'టిక్కు', 'ఇంటు' మార్కులు పెడితే ఓటు చెల్లదు.
- ✗ గడిలో కాకుండా మధ్యగీతలో అంకెను వేస్తే ఓటు చెల్లుబాటు కాదు.

పట్టభద్రుల ఎన్నికల్లో డబ్బులు పంచి

వైసిపి ఓటమిని అంగీకరించింది

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు



ప్రజాశక్తి- తిరుమల: రాష్ట్రంలో ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన నిధుల అభివద్ధి తప్ప, రాష్ట్రంలో అభివద్ధి జరగలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు అన్నారు. వీఐపీ ప్రారంభ విరామదర్శన ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ 2024 సంవత్సరంలో అధికారంలోకి వచ్చే దిశగా జనసేనతో కలసి అధికారంలోకి వస్తామన్నారు. డబ్బులు కోసం స్కాంలు చేసిన కేసిఆర్ కుమార్తె అయినా సిసోడియా అయిన చట్టంముందు ఒక్కటేనని ప్రజాక్షేత్రంలో శిక్షింపబడుతారని ఆయన జోష్యం చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లు, నగదు పంపిణీతో వైసిపి నైతిక ఓటమిని అంగీకరించిందని అన్నారు. తిరుమలలో పెంచిన వసతి గదుల ధరలను వెంటనే తగ్గించాలని, మరోసారి చలో తిరుపతి అనే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈప్రభుత్వం హయాంలో దేవాదాయశాఖను దేవాదాయ శాఖగా మార్చే ప్రవత్తి కనబడుస్తోందని అన్నారు. తిరుమలలో ఎక్కడా పరిశుభ్రత, పవిత్రత లేదని భక్తులు చెపుతున్నారని, వెంటనే భక్తులకు ఆధ్యాత్మిక భావన వచ్చేలా టిటిడి చర్యలు తీసుకోవాలని కోరారు.


తిరుమల జేఈవోను నియమించాలి

టిటిడి పాలక మండలి తీరుపై మండిపడ్డ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో అధికార వికేంద్రీకరణ చేసి జేఈవోను నియమించాలని ఉమ్మడి రాష్ట్రహైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒక న్యాయమూర్తిని అని కూడా చూడకుండా స్వామివారిని చూడాలన్నా ఆలయంలో సిబ్బంది తోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవి.వేణుగోపాల్, రాజోలు నియోజకవర్గ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, సినీనటి లయ స్వామివారి సేవలో పాల్గొన్నారు. వీరికి అధికారులు స్వాగతం పలికి దర్శనఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.



ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు

పోలీస్ శాఖ సమాయత్తం

2వేల మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు
ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీస్ యంత్రాంగానికి జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం

ప్రజాశక్తి- తిరుపతిటౌన్

జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్ర ఎంఎల్‌సి శాసన మండలి ఎన్నికలు సజావుగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీస్‌శాఖ సిబ్బంది, అధికార యంత్రాంగానికి జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు వరకు పోలీస్ వారికీ కేటాయించిన పోలింగ్ బూత్‌లు పూర్తిగా పోలీసుల అధీనంలోనే ఉండాలని, పోలింగ్ బూత్ వద్ద విధులు నిర్వర్తించే సిబ్బందికి బాధ్యతలను వివరించారు. ఎన్నికల నిభందనలు ప్రతిఒక్కరూ పాటించాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లఘించినట్లు తమ దష్టికి వస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. శాసన మండలి ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత పోలింగ్ జరిగేలా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసామని రాజకీయ పక్షాల నాయకులు, ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం వంటివి చేయరాదన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా 138 పోలింగ్ కేంద్రాలున్నాయని, అందులో 9 అత్యంత సమస్యాత్మకమైన కేంద్రాలు, 66 సమస్యాత్మకమైన కేంద్రాలు, 78 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా ఎన్నికల సంఘం వారు గుర్తించి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఎన్నికల నిర్వహణ సజావుగా, సమర్థవంతంగా నిర్వహించుటకు 37 మొబైల్ రూట్ పార్టీలను ఎస్‌ఐ ఇన్చార్జిగా, 24 స్ట్రైకింగ్ ఫోర్స్ సిఐ ఇన్చార్జిగా, 7 స్పెషల్ ట్రైనింగ్ ఫోర్స్ డిఎస్‌పి ఇన్చార్జిగా, 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఎంసిసి టీమ్స్ అదనపు ఎస్పీలు ఇన్చార్జిలుగా నియమించడం జరిగిందన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి జిల్లా సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీ చేస్తూ ఎలాంటి అక్రమరవాణ, ఎలాంటి ఘటనలు జరగకుండా అరికట్టడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్స్‌ను ఎన్నికల సంఘం వారు ఇచ్చిన గుర్తింపు కార్డులను ధరించి ఉంటేనే పిఓ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్ లోపలికి అనుమతించాలి. ఎన్నికల సంఘం వారు మనకు ఇచ్చిన ఎన్నికల విధులను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వర్తించి, విజయవంతంగా పూర్తిచేసి పోలీస్ శాఖకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్, పోలింగ్ బ్యాలెట్స్‌లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు అడ్మిన్, లక్ష్మీనారాయణ ఏఆర్, డిఎస్పిలు సురేంద్ర రెడ్డి ఎస్‌బి, నరసప్ప వెస్ట్, కాటమరాజు, విజయ్ శేఖర్ ట్రాఫిక్, మురళీకష్ణ ఈస్ట్, రవీంద్రారెడ్డి, నందకిషోర్ ఏఆర్, సిఐలు, ఆర్‌ఐలు, ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది హాజరయ్యారు.

ఎంఎల్‌సి ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తాం

జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు జిల్లా వ్యాప్తంగా పారదర్శకంగా నిర్వహిస్తామని తిరుపతి జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా తనను కలిసిన ప్రజాశక్తితో ఆయన వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

ప్రజాశక్తి విలేకరి: ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్‌పి: ఈనెల 13 జరగబోవు పట్టాభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నిలక సందర్భంగా జిల్లాలో అన్ని విధాలుగా పటిష్టచర్యలు తీసుకున్నాం.

ప్ర.వి : జిల్లాలో ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు.?

ఎస్‌పి: తిరుపతి జిల్లా వ్యాప్తంగా 138 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రతి కేంద్రంలో ఎన్నికల నిర్వాహణ సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా కావలసిన అన్ని చర్యలు తీసుకున్నాం.

ప్ర.వి : జిల్లాలో అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తిచారా?

ఎస్‌పి : తిరుపతి జిల్లాలో అత్యంత సమస్యాత్మక కేంద్రాలు 8గా ఇప్పటికే గుర్తించాం. వీటితో పాటు 51 సమస్యాత్మకమైన కేంద్రాలుగా గుర్తించి, ఆ పోలింగ్ కేంద్రాల్లో పోలీస్ బలగాలతో పాటు అదనపు కేంద్ర బలగాలను కూడా నయమించి సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం.

ప్ర.వి : ఎన్నికల పర్యవేక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

ఎస్‌పి: ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు 23 రెవెన్యూ రూట్స్‌లలో ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేసి, స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలింగ్ కేంద్రాల వరకు బ్యాలెట్ బాక్స్‌లకు ఎస్కార్ట్ చేసే విధంగా ఏర్పాటు చేసి, 37 పోలీసు రూట్ మొబైల్స్‌ను నిమించి ఎన్నికల జరిగే ప్రాంతాల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా నివారణ కోసం పెట్రోలింగ్ చేసే విధంగా ఏర్పాటు చేశాం.

ప్ర.వి : జిల్లా వ్యాప్తంగా ఎలాంటి భద్రత చర్యలు తీసుకున్నారు.?

ఎస్‌పి: జిల్లా వ్యాప్తంగా 10 చెక్ పోస్టులు, 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 24 స్ట్రైకింగ్ ఫోర్స్ టీంల ద్వారా ప్రతి సబ్‌డివిజన్లో తిరిగి, ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. అదనంగా డిఎస్‌పి స్థాయి అధికారితో క్విక్ రెస్పాన్స్ టీం, ఏఆర్ పార్టీలు 2 ఏర్పాటు చేసి, 34 ఎంసిసి టీమ్‌లను ప్రతి మండలానికి నియమించి, నిరంతరం ఎన్నికలు జరుగు ప్రాంతాల్లో పర్యవేక్షించేలా గట్ట చర్యలు తీసుకున్నాం.

ప్ర.వి: జిల్లాలో ఎన్నికల నియమవాళి ఏ విధంగా అమలు చేస్తున్నారు.?

ఎస్‌పి : ఈ నెల 13న జరుగనున్న ఎంఎల్‌సి పట్టాభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమనిబంధనల మేరకు జిల్లా వ్యాప్తంగా 11.3.23 సాయంత్రం 4 గంటల నుంచి ఎన్నికలు జరిగే 13.3.23 సాయంత్రం 4 గంటల వరకు సిఆర్‌పిసి 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదు. బహిరంగ ప్రాంతాల్లో ఎటువంటి సమావేశాలు నిర్వహించరాదు. శనివారం సాయంత్రం 4 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న వైన్‌షాపులు, బార్లు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మూసవేస్తాం. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠన చర్యలు తీసుకుంటాం.

ప్ర.వి: అభ్యర్థులకు పోలీసుశాఖ ఇచ్చే సూచన?

ఎస్‌పి: అభ్యర్థులు ఎవ్వరు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకూడదని, అలా బలవంతంగా మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను ఇవ్వజూపితే అది నేరం. దీనిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాము, ఇలాంటి ప్రలోబాలకు ఎవ్వరైనా గురిచేస్తే ఎలక్షన్ కమిషన్ వారికిగాని, పోలీసులకు, డయల్ 100కు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్ర.వి: ఎన్నికల నియామవాళిని ఓటర్లుకు మరోసారి తెలిజేయగలరు?

ఎస్‌పి: అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి.

- పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుంది.
- ఎన్నికల అధికారిచే గుర్తింపబడిన వ్యక్తులను మాత్రమే పోలింగ్ కేంద్రంలోపలకి అనుమతించబడును.
- ఇంక్‌పెన్‌లు, మొబైల్ ఫోన్స్, ఐప్యాడ్స్, ట్యాబ్స్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేంద్రంలోకి అనుమతించబడదు.
- ఆర్‌ఓ అధికారి ఉత్తర్వులు తూచా తప్పకుండా పాటించాలి.
- పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు యాక్టు 30, సిఆర్‌ఫిసి 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదు.
- ఎవ్వరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు.
- ఎవ్వరైనా రెచ్చగొట్టే విధంగా వాక్యాలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడడం వంటి చేయకుడదు.
- 11.3.23 సాయంత్రం 4 తర్వాత ఎలాంటి ఎన్నికల ప్రచారం చేయకుడదు.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఒరిజనల్ పాసులను కలిగిఉన్నవారు మాత్రమే వాహనంలో ప్రయాణించాలి.
- అభ్యర్థి ఉపయోగించే వాహనాన్ని ఇతరులు ఉపయోగించరాదు.
- వాహనంలో ఐదు మందికి మించి ఉండకుడదు.
- ఓటర్లను పోలింగ్ బూత్ వద్దకు తరలించరాదు.

ఉచిత 'విద్యా' ప్రాప్తిరస్తు..!



- గ్రామీణ పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య
- ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు
- విద్యాహక్కు చట్టం అమలుకు అధికారుల చర్యలు
- 18 నుంచి ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులు

ప్రజాశక్తి-పిచ్చాటూరు

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలనే నిబంధనలను ప్రభుత్వం కార్యరూపంలోకి తీసుకొస్తోంది. ఇందుకు అనుగుణంగా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 2022-23 విద్యా సంవత్సరంలోనే శ్రీకారం చుట్టింది. ఆయా మండలాల్లోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో గత ఏడాదే ప్రవేశం పొందారు. తొలుత అధికారులు స్వీకరించిన దరఖాస్తుల్లో రిజర్వేషన్లు, నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయించారు. ఎంపికైన జాబితాను రాష్ట్ర విద్యాశాఖ డీఈవోల ద్వారా ఆయా పాఠశాలలకు పంపారు. ఆ విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకులకు సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం ఇచ్చి ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేశారు.

2009 నుంచే విద్యా హక్కు చట్టం అమలు

విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ఏటా ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలని ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ అంశాన్ని ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో అర్హులు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకునే అవ కాశం కల్పించేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ప్రస్తుతం నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఐసీఎస్ఈ /సీబీఎస్ఈ/స్టేట్ సిలబస్‌లు అమలవు తున్న పాఠశాలల్లో ఈ సీట్లు కేటాయించాల్సి ఉంది. ఆ పాఠశాలలు ఈనెల ఆరో తేదీ నుంచి సీఎస్ఈ వెబ్ పోర్టల్లో రిజిస్టర్ కావాలని కమిషనర్ ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

షెడ్యూల్ ఇలా..

మార్చి 6 నుంచి 16 వరకు: సీఎస్ఈ వెబ్‌పోర్టల్లో ప్రైవేట్ పాఠశాలల రిజిస్ట్రేషన్
మార్చి 18 నుంచి ఏప్రిల్ 4 వరకు: విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ
ఏప్రిల్ 9 నుంచి 12 వరకు : విద్యార్థుల అర్హత నిర్ధారణ
ఏప్రిల్ 13న: లాటరీ ద్వారా మొదటి విడత జాబితా విడుదల
ఏప్రిల్ 15 నుంచి 21 వరకు: ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు
ఏప్రిల్ 25: లాటరీ ద్వారా రెండో విడత జాబితా విడుదల
ఏప్రిల్ 26 నుంచి 30 వరకు: ఆయా పాఠశాలల్లో రెండో విడత విద్యార్థుల ప్రవేశాలు

ప్రైవేటు పాఠశాలల్లో పక్కాగా చట్టం అమలు



విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో అందరికీ విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పేద పిల్లలను ఒకటో తరగతిలో ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశానికి అవకాశం కల్పించింది. చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ప్రవేశాలు జరుగుతాయి. పక్కాగా పర్యవేక్షించి 25 సీట్లు పేదలకు కేటాయించేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుత విద్యా సంవత్సరంలో చేసిన మాదిరిగానే వచ్చే ఏడాదీ అమలుకు ఇప్పటి నుంచే ప్రభుత్వం చర్యలు తీసుకోవడం మంచి నిర్ణయం.

- హేమమాలిని, ఎంఈవో, పుత్తూరు

పక్కాగా విద్యాహక్కు చట్టం అమలు



విద్యాహక్కు చట్టం-2009 ని జిల్లాలో పక్కగా అమలు చేయాలని ఇదివరకే ఎంఈవోలకు సూచించాం. గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు.. అమలు నిబంధనలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పేద విద్యార్థులకు సీట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ వి.శేఖర్, విద్యాశాఖాధికారి, తిరుపతి

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని వైసీపీ కార్యాలయం వద్ద మండల కన్వీనర్ ఆరని విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద ఎంపీపీ సుబ్బులక్ష్మి కేక్ కోసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను గుర్తించి ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గురునాథం, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు రవి, రమణయ్య, బుచ్చినాయుడుకండ్రిగ మండల కన్వీనర్ గురవయ్య, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుత్తూరు వైసీపీ కార్యాయంలో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరులు కుమారస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, ఏడీకే పవన్‌కుమార్, చిట్టిబాబు, మనోహర్‌రెడ్డి, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాల యుగంధర్‌రెడ్డి, సహదేవరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మహేందర్‌రెడ్డి, సింహాల మోహన్, దేవప్రసాద్, మునిరామ్, మనోహర్, అన్వర్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తిరుపతి(అర్బన్): వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర విద్యుత్ అటవీ భూగర్భ ఘనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించి కేకును కట్ చేశారు.



ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజానీకానికి సంక్షేమం, అభివద్ధి ఫలాలను అందిస్తున్న జగన్ ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అభివద్ధిపై సవాలు విసిరిన నారా లోకేష్ ఎంపీ మిథున్ రెడ్డి సిద్ధం అవగా మెల్లగా జారుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, టిటిడి పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, వైసిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బానిసత్వంలోకి జారుకోవద్దు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యువత చదువుకు తగ్గ ఉద్యోగాల్లేకుండా చేసిన జగన్ రెడ్డి ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ ఓట్లేసి పట్టభద్రులు బానిసత్వంలోకి జారుకోవద్దని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్న లక్షలాది నిరుద్యోగ యువతకు ప్రభుత్వ కొలువులో పనిచేయాలన్న కోరికను జగన్ చిదిమేశాడని మండిపడ్డారు. నాలుగేళ్ల పదవీకాలంలో ఒక్క డీయస్సీ నోటిఫికేషన్ కూడా జారీ చేయకుండా, ఉపాధ్యాయ నియామకాలనేవి లేకుండా చేసి, చాలీచాలని జీతాలకు ప్రైవేటు రంగంలో పనిచేసేలా చేసి నిరుద్యోగ ఉపాధ్యాయులను రోడ్డున పడేశాడని ఆరోపించారు. అలాంటి ప్రభుత్వానికి డబ్బు, మద్యం లాంటి ప్రలోభాలకు లొంగకుండా పట్టభద్రులంతా ఒక్కతాటిపైకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

మునెమ్మకు మంత్రి పరామర్శ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం రామసముద్రం గ్రామ సర్పంచ్ మునెమ్మ భర్త ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఆదివారం రామసముద్రం సర్పంచ్ మునెమ్మ ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మండంలోని నేసనూరులో తిరుపతి చెందిన కార్తీక కంటి ఆసుపత్రి డాక్టర్ ఎన్ నరహరి సునీల్ సహకారంతో సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తమ పంచాయతీ ప్రజల సంక్షేమం కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్లకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌వో సుబ్రమణ్యం, ఏఎన్ఎం తులసి, శైలాజ, నేసనూర్ అంగన్‌వాడీ కార్యకర్త ధనమ్మ, సచివాలయం ఏఎన్ఎం గాయత్రి, ఆశ కార్యకర్తలు, పుత్తూరు మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని న్యాయవాది గుమ్మల్ల రాజేశ్వరరావు సూచించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆదివారం 135వ నెల ఇంటి సరుకులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా న్యాయవాది గుమ్మల్ల రాజేశ్వరరావు పాల్గొన్నారు. దివ్యాంగులు ముందుకు వస్తే వారికి ఉపాధి కల్పించేందుకు సంస్థ వ్యవస్థాపకుడు మునీర్ బాషా సిద్ధంగా ఉన్నారని చెప్పారు. గరికపాటి రమేష్ బాబు, కొల్లూరు హరినాయుడు, బాబా ఫరీద్, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'దొంగ ఓట్లను ఆధారాలతో నిరూపించాం'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దొంగ ఓట్లను తయారు చేసి అక్రమ పద్ధతిలో వైసీపీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ప్రయత్నాలు చేశారని, తిరుపతి నగర పరిధిలో ప్రతి డివిజన్‌ను జల్లెడ పట్టి దొంగ ఓట్లను ఆధారాలతో సహా నిరూపించామని తిరుపతి మాజీ శాసన సభ్యురాలు సుగుణమ్మ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుగుణమ్మ మాట్లాడారు. ఆధారాలతో సహా దొంగ ఓట్లను నిరూపిస్తే నిజాలను ఒప్పుకోలేని స్థితిలో వైసిపి ఉందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జరిగిన ఏ ఎన్నికల్లో అయిన దొంగ ఓట్లు వేయిస్తూ తిరుపతిని దొంగ ఓట్లకు కేంద్రంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకుని మేధావులుగా మసిలే వ్యక్తులు వెళ్లే శాసనమండలికి ఇలా దొంగ ఓట్లతో మండలికి వెళ్లాలని వైసిపి కుట్రకు విజ్ఞులైన పట్టభద్రులు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. దొంగ ఓటును నమోదు చేసుకోవడమే ఒక నేరమని, అలా నమోదై ఓటు వేయడం మరొక నేరమన్నారు. తిరుపతి నగరంలోని పదివేల దొంగ ఓట్లను గుర్తించి అధికారుల దష్టికి తీసుకెళ్లామన్నారు. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ దొంగ ఓట్లు ఉన్నాయని గ్రహించి కొందరు అధికారులను ఎన్నికల విధులకు దూరంగా ఉంచడమే ఇందుకు నిదర్శనమన్నారు. టిడిపి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న కంచర్ల శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని, రెండవ ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డికి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్న ఏపీటీఎఫ్ అభ్యర్థి రమణారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని, రెండవ ప్రధానితో ఓటును పిడిఎఫ్ అభ్యర్థి బాబు రెడ్డికి వెయ్యాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తిరుపతి నగరంలో ఈ దొంగ నోట్ల కలకలం రేపుతున్న శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి అదేమీ లేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరిగే శాసనమండలి ఎన్నికకు జిల్లా అధికారులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు సురేంద్ర కుమార్, బుల్లెట్ రమణ, కార్పొరేటర్ ఆర్‌సీ మునికష్ణ, దంపూర్ భాస్కర్ యాదవ్, మునిశేఖర్ రాయల్, ఊట్ల సురేంద్ర నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో ఎస్వీసీఈ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జేఎన్టీయూ అనంతపురం వార్షిక ఆటల పోటీలలో తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థినీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని, కళాశాల ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని కళాశాల ఛైర్మన్ గంగిరెడ్డి తెలిపారు. జేఎన్టీయూ పరిధిలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో ఎక్కువమంది ఎస్వీసీఈ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్లు ప్రకాష్ అంబవరం, ప్రదీప్ అంబవరం, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రావు, కళాశాల వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.


విద్యార్థికి రూ.లక్ష ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మున్సిపాలిటీలోని టాలెంట్ స్కేటింగ్ అకాడమిలో నాన్ స్టాప్ 270 కిలోమీటర్ల రోడ్డు స్కేటింగ్ మార్థాన్ ఓల్డ్ రికార్డు విన్నర్‌గా నిలిచిన విద్యావేద నరసింహని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా అభినందించారు. రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా విద్యార్థి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వజ్రా ఓల్డ్ రికార్డు ప్రతినిధులు, టాలెంట్ స్కేటింగ్ కోచ్ ప్రతాప్, పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు, స్కేటింగ్ కోచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందించిన రాష్ట్ర మంత్రి ఆర్.కె.రోజా

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలి





ప్రజాశక్తి-పిచ్చాటూరు: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని.. ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని తహశీల్దారు మధుసూదన్, ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. పోలింగ్‌స్టేషన్ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని.. ఓటర్లు 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్యవేడు: సత్యవేడు, వరదయ్యపాలెం, నాగలాపురం మండలాలలో నేడు జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని అడిషనల్ ఎస్పీ విమలకుమారి పర్యవేక్షణలో ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్సైలతో కూడిన దాదాపు 50 మంది పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని..సీఐ శివకుమార్‌రెడ్డి తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేశామని.. ఇప్పటికే 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఆయా మండలాలలో బయట వ్యక్తులు ఎవరైనా ఉంటే గుర్తించి బయటికి పంపుతున్నామని.. చట్టాన్ని ఉల్లంఘించరాదని.. పోలింగ్ బూత్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

బాలాయపల్లి : పోలింగ్ కేంద్రాలు వద్ద ఎటువంటి అవాంతరాలు జరగకుండా నిఘా ఉండాలని తహశీల్దారు శ్రీనివాసులు అన్నారు. 200 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసులకు ఆదేశించారు. ఓటర్లు ప్రూఫ్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలో 1174 మంది పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు 26 మంది ఉన్నారన్నారు. రెవెన్యూ సిబ్బంది పంచాయతీరాజ్ శాఖ, పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు అజ్మీత్తుల్లఖాన్, ఏ ఎస్ ఐ రామేశ్వరరావు, మండలశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు డేటా సైన్స్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-క్యాంపస్: ఏపీ స్టాటిస్టికల్ అసోసియేషన్ మొదటి వార్షిక సమావేశాల్లో భాగంగా సోమవారం తిరుపతి లో డేటా సైన్స్ సెంటర్ ప్రారంభిస్తున్నట్లు ఐఎస్ పీఎస్ అధ్యక్షుడు పి.రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీ స్టాటిస్టికల్ అసోసియేషన్ మొదటి వార్షిక సమావేశాల సందర్భంగా ఈ సెంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. దీని ద్వారా ఆసక్తి కల్గిన వారికి డేటా సైన్స్ లో నిపుణుల ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. కెనడాలోని మెక్ గిల్ యూనివర్సిటీ ఎమిర్టస్ ప్రొఫెసర్ ఏఎం మత్తాయ్ మాట్లాడుతూ నాణ్యమైన సాంఖ్యక శాస్త్రవేత్తల కొరత ఉందన్నారు. విద్యార్థులు తమ కోర్సులు ముగిసిన వెంటనే ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పరిశోధనల రంగంలోకి వస్తున్న వారి సంఖ్య తగ్గుతుందని చెప్పారు. యువతను పరిశోధనల వైపు ప్రోత్సాహం అందించాలన్నారు. నాణ్యమైన పరిశోధనల దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. డేటా సైన్స్ లో సాంఖ్యక అనువర్తనాలు ఉపయోగిస్తామన్నారు. ప్రస్తుతం ఈ కోర్సుకు ఎంతో ప్రాధాన్యత పెరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పవన్ కుమార్, రాజశేఖర్ రెడ్డి, యాదవేంద్రబాబు, శివపార్వతి, ఐఐటీ ప్రొఫెసర్ ఇసుపతిక్ దాస్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డేటా సైన్సుతో మెండుగా అవకాశాలు

మహిళా వర్సిటీలో వర్క్‌షాప్ ప్రారంభం



ప్రజాశక్తి-క్యాంపస్: డేటా సైన్స్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతో ందని, ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి అనేక అవకాశాలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో ' డేటా సైన్స్ టెక్నిక్స్' అనే అంశంపై ఆదివారం వర్క్ షాప్ నిర్వహించారు. ఏపీ స్టాటిస్టికల్ అసోసియేషన్ తొలి వార్షిక సమావేశాల్లో భాగంగా ఈ వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి బయోట్రిమ్‌కు చెందిన స్టేట్ అసిస్టెంట్ సెర్వికల్చరిస్ట్ పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వన్యప్రాణుల సంరక్షణలో డేటా సైన్స్ ఉపయోగాలు, అనువర్తనాలు వివరించారు. ఫోర్డ్ మోటార్ కంపెనీ టెక్నికల్ ఎక్స్ ఫర్ట్ టీం మేనేజర్ ఎస్. యాదవేంద్రబాబు తన ప్రసంగంలో డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాలను, డేటా సైన్స్ అనువర్తనాలు, అవకాశాలు వివరించారు. ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్ పీఎస్) అధ్యక్షుడు తిరుపతి లో డేటా సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను తన ప్రసంగంలో వివరించారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శివ పార్వతీ సదస్సు ఉద్దేశం, ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమం రాయలసీమ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్ కుమార్ వర్మ, ఎస్వీయూ ప్రొఫెసర్ భూపతి నాయుడు, తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ ఇసుపతి పాఠక్, చెన్నై ప్రెసిడెన్సీ కళాశాలకు చెందిన విశ్వనాథన్, ఎస్వీ వ్యవసాయ కళాశాల కు చెందిన నఫీజ్ ఉమర్, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ కి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.హరి మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.